# శ్రీవేంకటేశ్వర దివ్యచరిత్ర

– ఆచార్య కావేరిపాకం సర్వోత్తమ రావు

**తిరుమల :**

'తిరుపతి' అనే పదబంధంలో తిరు–పతి అనే రెండు శబ్దాలున్నాయి. ఈ రెండు శబ్దాలలో 'తిరు' అన్నది తమిళశబ్దం. పతి అన్నది సంస్కృతం. తమిళులు శ్రీకారానికి బదులుగా 'తిరు'కు ప్రాధాన్యం ఇచ్చారు. శ్రీవైష్ణవ సంప్రదాయవాదులు 'తిరు' అంటే సకలసంపదలను అనుగ్రహించే లక్ష్మీదేవి మాత్రమే అని అర్థవిశేషం చెబుతారు. ఈ భావనతో 'శ్రీపతి' అనడానికి బదులు 'తిరుపతి' అని వ్యవహరిస్తారు. గ్రాంథిక తమిళవాదులు 'తిరుప్పతి' అని నొక్కి చెబుతారు. తాళ్ళపాకపదకవులు కూడ వేంకటేశ్వరుని 'శ్రీపతిపురనాయకా' అని తమ 'పదాలలో' సంబోధించారు.



'తిరుమలై' అనే సమాసంలో కూడా 'తిరు' శ్రీవాచకమే. సంస్కృతాంధ్రభాషలలోని గిరి పర్వతం, నగం, అచలం, శైలం అనేవి 'కొండ' శబ్దం లాంటివే. తెలుగువారు 'కొండ' అనే అచ్చతెలుగు శబ్దాన్ని అభిమానిస్తే తమిళులు 'మలై' శబ్దాన్ని తఱచు వాడుతుంటారు. మరుదమలై, శబరిమలై, పళనిమలై, పొదిగైమలై లాంటివి ఉదాహరణాలు. 'తిరుమలై' తెలుగులో 'తిరుమల'గా రూఢి అయింది. ఆళ్వారులలో ఒకరయిన పేయాళ్వార్ తన పాశురాలలో 'తిరుమలై' శబ్దాన్ని (3–63) ప్రయోగించారు. తెలుగు పదకవులలో అన్నమయ్య

**కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ**
**తెట్టలాయ మహిమలే తిరుమలకొండ**

(ఆధ్యాత్మ 282 ఱేకు)

అని నోరార ప్రశంసించినాడు. అయినా పామరులు కొండకింది భాగాన్ని దిగువ తిరుపతిగా,



కొండపై భాగాన్ని ఎగువ తిరుపతిగానే వ్యవహరిస్తారు.

**తిరుమల ప్రాచీనత :**

తిరుమల అత్యంత ప్రాచీనమయిన పుణ్యక్షేత్రం. ఋగ్వేదం 7.153.8లోని అరాయికాణే వికటే గిరిం గచ్ఛ' అనే సూక్తం వేంకటాచల మహిమను చాటేదే. బ్రహ్మపురాణం లాంటి పంద్రెండు పురాణాలలో వేంకటాచల ప్రసక్తి, వేంకటేశ్వరసంబంధికథాంశాలు నిండుగా మెండుగా ఉన్నాయి. ప్రాచీనతమిళవాఙ్మయంలో 'తిరువేంగడం' తమిళ ప్రాంతానికి సరిహద్దుగా చెప్పబడింది. ఆళ్వారుల పాశుర సంకలనమయిన 'నాలాయిరం'లో 'తిరువేంగడం' ప్రాశస్త్యం. స్వామి వైభవం, ఇతర దివ్యదేశాలతోడి సమానత్వం లాంటివి కనిపిస్తాయి. ఆళ్వారులలో తొండరడిప్పొడి ఆళ్వార్, మధురకవి ఆళ్వార్ తప్ప ఇతరులు స్వామిని ఘనంగా కీర్తించినవారే.



ఆళ్వారులు కీర్తించిన వైష్ణవాలయాలను 'దివ్యదేశాలుగా' గణించడం శ్రీవైష్ణవ సంప్రదాయం. అలాంటి 108 దివ్యతిరుపతులలో శ్రీవైష్ణవులకు శ్రీరంగం, శ్రీకాంచీపురం, తిరుమల చాల ముఖ్యమయినవి. సర్వజనులకు, సర్వజగాలకు రక్షకుడు శ్రీనివాసుడొక్కడే. అందుకే 'కలౌ వేంకటనాయకః' అనడం.

వ్యవహారంలో 'తిరుమలను' ఒక పర్వతంగానే భావించినా, చెప్పినా ఆ పర్వతం ఏడుకొండల సమాహారం. స్వామికి ప్రతిదినం చెప్పే సుప్రభాతంలో శ్రీశైలం, శేషాద్రి, వరాహాద్రి, వేంకటాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, గరుడాద్రి పర్వతాల పేర్లు కనిపిస్తాయి. కొందరు వృషాద్రిని కూడా గణిస్తుంటారు. ఇవేగాక తిరుమలకు 24 పేర్లున్నట్టు పురాణాలవల్ల తెలియవస్తున్నది. కాని దాక్షిణాత్యులు 'ఏళుమలైయానే', 'ఏడుకొండలవాడా' అని చేతులు జోడిస్తారు.

**వేంకటేశ్వరుడి అవతారగాథ :**

బ్రహ్మ, మహావిష్ణువు, మహేశ్వరులు త్రిమూర్తులు. వారిలో విష్ణువు స్థితికారకుడు. ఆ కారణాన సాధుసంరక్షణ కోసం, దుష్టశిక్షణ కోసం, ధర్మసంస్థాపనకోసం అనేక అవతారాలుగా సాక్షాత్కరిస్తాడు. ఈ అవతారాలు అనంతమయినా వాటిలో ఏకవింశతి అవతారాలు(21) దశావతారాలు(10) సుప్రసిద్ధం. ఈ అవతారాల రూపురేఖలలో తేడాలుంటాయి. కాని వైకుంఠవాసుడయిన వెన్నుడు తనదయిన స్వస్వరూపంతోనే వైకుంఠవిరక్తుడై భూలోకంలో అడుగులు పెట్టి తిరుమలలో కలియుగరక్షకుడై అర్చామూర్తిగా దర్శనమిస్తున్న దివ్యమూర్తి. ఆకర్షకమూర్తి. అతడే వేంకటేశ్వర నామాంకితుడు.

మహావిష్ణువు వేంకటేశ్వరుడుగా అవతరించ డానికి చాలా కారణాలున్నాయి. మొదటిది కలియుగంలో



దైవభక్తి, పాపభీతి, నైతికవిలువలు కలవారికి తానున్నానని భరోసా కల్పించడం ఒక కారణం. రెండవది తన్ను వరించిన లక్ష్మీదేవి బాధతో తనతో తగవులాడి వెళ్ళిపోవడంతో వైకుంఠంలో ఏకాకిగా ఉండడానికి ఇష్టపడక స్వామి భూలోకంలో అడుగులు పెట్టడం మరోకారణం. మూడవది స్వామి లీలావిశేషం. ఈ కారణాలకు మరొక నేపథ్యముంది.

ఒకప్పుడు పవిత్రగంగానదీతీరంలో చాలమంది మునులు చేరారు. వారు సదా లోకకల్యాణ చింతనాపరులు కనుక లోకకల్యాణార్థం ఒక యాగం చేయాలనుకొన్నారు. సన్నాహాలు మొదలయ్యాయి. సరిగ్గా ఆ సమయంలోనే దేవర్షి నారదులవారు అక్కడికి వచ్చారు. అక్కడి హడావిడి చూచి 'ఏమిటని' ప్రశ్నించారు. మునులు తమ సంకల్పాన్ని తెలియజేశారు. నారదులవారు వారిని ప్రశంసిస్తూ యాగఫలభోక్త 'ఎవరని' ఎదురుప్రశ్న వేశారు. మునులు



తికమక పడ్డారు. చివరకు త్రిమూర్తులలో సర్వశ్రేష్ఠుడెవడో తేల్చడానికి భృగుమహర్షి ఒకడే సర్వసమర్థుడని భావించారు. ఆ బాధ్యతను భృగుమహర్షికి అప్పగించారు. భృగుమహర్షి సరేనన్నాడు. సరాసరి ఆ మహర్షి సత్యలోకం చేరుకొన్నాడు. ఆ లోకంలో సరస్వతీదేవి వీణానాదంలో బ్రహ్మ పరవశించి పోతున్నాడు. మహర్షి రాక గురించి వారికేమీ తెలియదు. కాని భృగుమహర్షి ఇదొక అవమానచర్యగా భావించి బ్రహ్మతో 'నీకు భూలోకంలో పూజలుండవ'ని శపించి రుసరుసలాడుతూ కైలాసం కేసి పయనమయ్యాడు. అక్కడ పార్వతీపరమేశ్వరుల ఏకాంతాన్ని భృగుమహర్షి గుర్తించినా తన్ను వారు పట్టించుకోలేదని బుసకొట్టాడు. 'పరమశివా! నీకు భూలోకంలో లింగపూజలే' అని శపించి వైకుంఠంకేసి అడుగులు వేశాడు.

వైకుంఠంలో స్వామి శేషతల్పంపై శయన భంగిమలో ఉన్నాడు. రమాదేవి సేవలు చేస్తున్నది.



లక్ష్మీనారాయణులు కూడా తన రాకను గుర్తించకపోవడం గమనించి కోపంతో అడుగులు ముందుకు వేసి విష్ణువు వృక్షఃస్థలంపై మహర్షి తన్నాడు. లక్ష్మి పక్కకు ఒదిగింది. మహావిష్ణువు లేచినపుడు లక్ష్మి భృగువును మందలిస్తాడని భావించింది. కాని స్వామి ప్రసన్నవదనంతో భృగువు కాలును పట్టుకొని ఆ కాలిలోని అహంకార నేత్రాన్ని చిదిమేశాడు. భృగువు త్రిమూర్తులలో మహావిష్ణువే కరుణాళువని, జగద్రక్షకుడని, అతడే త్రిమూర్తులలో అధికుడని నిశ్చయించుకొని ఆ విషయాన్నే మునులకు నివేదించాడు. వారు కూడా తమ సమస్యకు సమాధానం దొరకడంతో సంతోషంతో తమ యాగాన్ని కొనసాగించారు.

వైకుంఠంలో 'మహాలక్ష్మి' తన స్థానమయిన వక్షస్థలంపై మహర్షి తన్నడం. ఆవేళ మగని మాటలు ఆ తల్లికి రుచించలేదు. మగనిని ఏమీ అనలేక వైకుంఠంలో

ఉండడానికి ఇష్టపడక కరవీరపురానికి (కొల్హాపురం) వెళ్ళిపోయింది. ఇల్లాలు బాధతో వెళ్ళిపోవడం, వైకుంఠం శూన్యంగా కనిపించడంతో విష్ణువు ఆ లోకంలో ఉండలేక పోయాడు. సరాసరి వేంకటాచలం చేరాడు. తిరుమల కొండపై దక్షిణదిశలో ఒక చింత చెట్టుకింద ఒక పుట్టలో నివాసం ఏర్పాటు చేసుకొన్నాడు. అన్నపానాదులు లేక భూలోకవాసనలతో అలసిపోయాడు. పరంధాముని దీనావస్థను బ్రహ్మ, పరమశివులు పసిగట్టారు. పరిష్కారదిశగా వారిద్దరు కొల్హాపురం చేరి వెన్నుని దీనావస్థను విన్నవించారు. కాని ఆ తల్లి మనసు కరగలేదు. చివరకు బ్రహ్మమాహేశ్వరుల ఆలోచనలకు సరేనంది. తాను గోపాలిక అయింది. బ్రహ్మ గోమాత అయ్యాడు. శివుడు ముచ్చటయిన దూడ అయ్యాడు. గోపాలిక అయిన లక్ష్మి తిరుమల ప్రాంతపాలకుడయిన చోళమహారాజుకు దూడ తోడి ఆవును అమ్మి తనదారిన తాను వెళ్ళిపోయింది.



పసులకాపరి రాజుగారి గోసంపదతో మేతకోసం రోజూ అడవికి వెళ్ళేవాడు. ఆ సంపదతో కొత్తగా చేరిన గోవు కూడా వెళ్లేది. కాపరి కళ్ళు కప్పి ఆ ఆవు ఒంటరిగా తిరుమల కేసి కదిలేది. ఒక చింత చెట్టుదగ్గర ఆగి పుట్టపై పాలును స్రవింపజేసేది. అన్నపానాదులు లేని స్వామికి ఆ ఆవు పాలే అమృత ప్రాయమయింది. ఆ తరువాత ఆ ఆవు మందలో కలసిపోయేది. కాని నగరు చేరుకొన్నా ఆ ఆవు పాలిచ్చేది కాదు. ఇందులో ఏదో కిటుకు ఉందని మరుసటిరోజు గోపాలుడు కాపరితో వెళ్ళాడు. ఆవు అందరి కళ్ళు కప్పి దూరంగా వడివడిగా వెళ్ళడం చూచి గోపాలుడు వెంబడించాడు. యథాప్రకారం ఆవు పుట్టదగ్గర ఆగింది. పాలు స్రవించసాగింది. గోపాలుడు కస్సుమన్నాడు. వెంటనే గొడ్డలిని ఆవుకేసి విసిరాడు. పుట్టలోని స్వామి గతుక్కుమన్నాడు. పుట్టనుండి పైకి లేవబోయాడు. పుట్టనుండి రక్తం ఎగజిమ్ముతూ ఉంది.



గొడ్డలి పెట్టుకు తానే అడ్డుపడడంతో చిబుకంలో గాయమయింది. పుట్టనుండి ఒక మహాపురుషుడు లేవడం, ఆవు పక్కకు తప్పుకోవడం చూచి గోపాలకుడు భయపడ్డాడు. వెనువెంటనే ఈ వార్తను రాజుకు చేరవేశాడు. రాజు హుటాహుటిగా ఆ ప్రదేశం చేరుకున్నాడు. తన బంటు చేసిన తప్పుకు క్షమాపణ అర్థించాడు. స్వామి పాదాల పడ్డాడు. కాని స్వామి శాంతించలేదు.

'మహారాజా! గొడ్డలితో గోవును కొట్టడానికి గోపాలకుడు కారకుడు కావచ్చు. కొట్టినవాడు నీ పాలనలోనివాడు. అందుకు రాజుగా శిక్ష అనుభవించక తప్పదు. నీవు పిశాచమవుతావు' అన్నాడు. రాజు దైన్యంగా ప్రార్థించాడు. చివరకు స్వామి

'రాజా! నా శాపానికి తిరుగులేదు. త్వరలో ఆకాశరాజుకు ఒక బిడ్డ లభిస్తుంది. ఆ అమ్మాయి



పద్మావతిగా దినదినప్రర్థమానమవుతుంది. ఆమెను నేను వివాహమాడతాను. ఆ కల్యాణమహోత్సవకాలంలో నూరు బారువుల బంగారం బరువుండే కిరీటం నాకు ఆకాశరాజు కానుకగా సమర్పిస్తాడు. ఆ కిరీటాన్ని నేను ఆరుఘడియలకాలం ధరిస్తాను. అపుడు నా నేత్రాల నుండి ఆనందాశ్రువులు రాలతాయి. ఈ దృశ్యాన్ని చూచి నీవు సంతోషిస్తావు' అన్నాడు. కలియుగంలో తన్ను మొదట దర్శించినవాడు గొల్లడే. అర్చామూర్తిగా ఉన్నంతకాలం ఆ గొల్లసంతతి వారికే నా తొలిదర్శనం' అని వరం అనుగ్రహించాడు. తదనంతరం స్వామి తిరుమలలోని పుష్కరిణివైపు కదిలాడు. అక్కడి ఆదివరాహమూర్తిని కలిశాడు.

'స్వామీ! నేను ప్రస్తుతం ఏమీ లేనివాణ్ణి. ఇల్లూ లేదు–ఇల్లాలూ లేదు. నాకు మీ ఆసరా కావాలి. నేనుండడానికి నూరు అడుగుల స్థలం నాకివ్వు. ఇందుకు

ప్రతిఫలంగా నన్ను సేవించడానికి వచ్చేవారు మిమ్మల్ని ముందు సేవిస్తారు. అంతేకాదు మొదటిపూజ, తొలి నివేదన మీకే. ఆపై నాకు' అన్నాడు. వరాహమూర్తి సంతోషించాడు. సరేనన్నాడు. శ్రీనివాసా! నీవు ఒంటరివాడవు. పైగా మానసికంగా గాయపడ్డావు. నిన్ను పట్టించుకొనేవారు ఈ పరిస్థితిలో నీకు దగ్గరుండడం చాలా అవసరం. ఇదిగో! ఈవిడ వకుళాదేవి. నీ ఆలనా పాలనా బాధ్యత ఇక వకుళమ్మదే' అని పరిచయం చేశాడు.

వకుళమ్మ ఎవరోకాదు. ద్వాపరయుగం నాటి యశోద. శ్రీకృష్ణుడు అష్టమహిషులను పెళ్లాడినా ఆ కల్యాణాలు చూ నోచుకోని తల్లి. ఆమె ఆరాటం గుర్తించి కృష్ణుడే అమ్మా! నీ కోరిక కలియుగంలో నెరవేరుతుంది. నీవే నాకు కల్యాణసంధాతవు' అని అనుగ్రహించాడు. ఆ తల్లి మమకారంతో శ్రీనివాసుడు సర్వమూ మరచాడు. మామూలు మనిషయ్యాడు.



**పద్మావతీ పరిణయం :**

ఆకాశరాజు, తొండమాన్ ఇద్దరు సోదరులు. చంద్రవంశజులు. చోళదేశపాలకులు. ఒకసారి ఆకాశరాజు సంతానార్థం యజ్ఞభూమిని దున్నుతుంటే ఆ యజ్ఞభూమిలో సహస్రదళపద్మంలో ఒక ఆడశిశువు లభించింది. ఆకాశరాజు ఆ శిశువుకు 'పద్మావతి' అని నామకరణం చేశాడు. ఆకాశరాజు భార్య ధరణీదేవి పద్మావతిని గారాబంగా చూసేది. కొంత కాలానికి ఆమెకు వసుదాముడనే కుమారుడు పుట్టాడు. పద్మావతి క్రమంగా అందాల రాశి అయింది. ఆమె చెలికత్తెలతో ఒకసారి విహారం నెపంతో నారాయణవనం పొలిమేర దాటివెళ్ళింది. సరిగ్గా అక్కడికే శ్రీనివాసుడు కిరాతవేషంలో తారసిల్లాడు. ఈ లోగా ఒక ఏనుగు ఘీంకరిస్తూ పద్మావతి వైపు పరిగెత్తుతుంటే శ్రీనివాసుడు ఆ ఏనుగును అదుపులోకి తెచ్చాడు. చెలికత్తెలు సంతోషించారు. కాని ఆ కిరాత



వేషధారి తన చెలి పద్మావతితో పరాచికాలాడడం వారు సహించలేకపోయారు. చివరకు అతణ్ణి వదలించుకోవ డానికి అతనిపై రాళ్ళు రువ్వారు. కిరాతునిపై రాళ్ళు పడ్డాయి. గాయాలయ్యాయి. ఆపై పద్మావతి నారాయణవనంకేసి నడిస్తే కిరాతవేషధారి వేంకటాచలం చేరుకున్నాడు. కుమారుని గాయాలు చూచి వకుళమ్మ గతుక్కుమంది.

'కుమారా! అడవికి వేటకోసం వెళ్ళి క్రూర మృగాలను చూచి జడుసుకొన్నావా? లేదా ఏదయినా భూతం పట్టిందా? రాళ్ళ మీద నడయాడుతూ జారిపడ్డావా? వాగుల్లో పడి అతికష్టంతో లేచి వచ్చావా? నిజం చెప్పు' అంటూ ఉపచారాలు చేసింది. ఆపై అన్నం పెడితే మారాం చేశాడట శ్రీనివాసుడు. తల్లి ఒకసారి శ్రీనివాసుని కళ్లల్లోకి చూసింది. ఈ గాయాలకు మరేవో కారణాలని పసిగట్టింది.



'నాన్నా! అడవిలో అందాలరాశిని చూశావా? మనసు పారేసుకొన్నావా? ఎవరామె? అని గుచ్చి గుచ్చి అడిగింది.

శ్రీనివాసుడు సర్వం చెప్పాడు. అంతటితో ఆగక 'అమ్మా! ఆ అందాలరాశిని వలచానే. ఒక శుభలగ్నంలో ఆమెతో నాకు పెళ్ళి జరిపించవమ్మా' అన్నాడు గోముగా.

వకుళమాత సరేనంది. కొండ దిగింది. కపిలతీర్థంలో తానమాడింది. కపిలేశ్వరునికి మొక్కుకొంది. సరాసరి నారాయణపురంకేసి నడిచింది.

శ్రీనివాసుడు క్షణం ఆలోచించాడు. తల్లిని పంపడం బాగుంది గాని అమ్మాయి తరఫువారు శ్రీమంతులు. రాజవంశజులు. వారిని వకుళమ్మ కలుసుకోవడం సాధ్యమా? పెళ్ళికి ఒప్పించడం అంత తేలికా? జాగ్రత్తగా మసలకపోతే మొదటికే

మోసమనుకొన్నాడు. తానే ఎరుకత అయ్యాడు. నారాయణవనం చేరాడు. ధరణీదేవి అంతఃపురంలో ప్రవేశం లభించింది. చివరకు సోదె చెప్పి మెప్పించాడు. కొండమీదివాడు, నీవు మెచ్చినవాడు, నీకు అన్ని విధాల తగినవాడు తప్పక మగడవుతాడని పద్మావతితో నవ్వుతూ చెప్పాడు.

ధరణీదేవి చాల సంతోషించింది. లోగడ పద్మావతిని చూచి నారదమహర్షి ఈమెకు నారాయణుడే పతి అన్న మాటలు ఆమెకు గుర్తుకు వచ్చింది. ధరణీదేవి ఎరుకతకు బహుమానాలిచ్చి సాగనంపింది.

ఎరుకత వెళ్ళాక వకుళమ్మ ధరణీదేవిని కలుసుకొంది. వకుళమ్మ సౌమ్యత వారికి నచ్చింది. అమ్మా, మహామాత! ఎవరమ్మా నీవు? అని ప్రశ్నించింది. వకుళమ్మ సగర్వంగా అమ్మా! నేను వేంకటేశ్వరుని దాసిని. మా



నివాసం శేషాద్రి. నా బిడ్డ పంపగా వచ్చాను. నా వాడు మీ అమ్మాయిని చూచి ఆమెనే పెళ్ళాడాలని మనసుపడ్డాడు. మావాడు సామాన్యుడు కాడు. అందంలో మన్మథుడు. సౌభాగ్యంలో లక్ష్మీవిభుడు. గుణగణనంలో సద్గుణుడు. వేదోక్తంగా ధర్మాలు ఆచరించే సచ్ఛీలవంతుడు. మీ అమ్మాయికి అన్నివిధాల తగినవాడు. మీరెంతో పుణ్యం చేసుకొన్నవారు. మాధవుడే అల్లుడు కాబోతున్నాడు. నేను వచ్చిన పనిని రాజుగారికి మనవి సేయవమ్మ అంది. ధరణీదేవి అలాగే చేసింది. రాజు స్వయంగా వచ్చి వకుళమ్మను చూచి ఆదరించాడు. వివాహానికి అంగీకరించి హరికి శుభలేఖ పంపించాడు. వకుళమ్మ శ్రీనివాసునికి నారాయణవనం వార్తలన్ని చెప్పి తన పని పూర్తయిందని సంతోషాన్ని ప్రకటించింది.

పద్మావతితో తనకు వివాహం నిశ్చయం కావడంతో శ్రీనివాసుడు సామాన్యవ్యక్తిగా చింతలో



పడ్డాడు. అమ్మాయి వైపువారు శ్రీమంతులు, రాజ్యపాలకులు, మందీమార్బలానికి కొదువలేదు. తానేమో నిరుపేద. వివాహమా ఖర్చుతో గూడిన మంగళకార్యం. తన దగ్గర కానీ డబ్బులేదు. అమ్మాయి పక్షం వారికి సరితూగేలా లేకపోతే అవమానమనుకొంటూ అప్పు చేయడం తప్ప మరో గత్యంతరం లేదని కుబేరుని యాచించాడు. కుబేరుడు సరేనన్నాడు. వడ్డీపత్రం వ్రాసి ఇవ్వనిదే డబ్బిచ్చే అలవాటు లేదన్నాడు. శ్రీనివాసుడు సరేనన్నాడు. ఆనాడు శ్రీనివాసుడు వ్రాసిచ్చిన వడ్డీపత్రం–

సీ ॥ **శ్రీకరలీల స్వస్తి శ్రీ జయాభ్యుద**
**యాష్టాదశ ద్వాపరాంతమందు**
**గల కలినాది వేంకటనాయకుడు ధన**
**పతికొసంగిన వడ్డిపత్ర మెట్ల**
**యనినను మా వివాహమునకు నీ చేత**
**నప్పుగ గైకొనిన యట్టి రామ**



**టెంకి నిష్కములు కోటియు జతుర్దశ లక్ష**
**లందులకు వడ్డి సహ్రసనిష్క.**

తే ॥ **ములను బ్రతివత్సరము దీర్చి మొనయు కలియు**
**గాంతమున మేము గైకొనినంత విత్త**
**మియ్యగలవార మజరుద్రలిందుకిపుడు**
**సాక్షు లశ్వత్థు డిచ్చట సాక్షి నిజము.**

(తరిగండ వెంగమాంబ –
వేంకటాచలమాహాత్మ్యము 6.151)

అని వడ్డీపత్రం వ్రాసి ఇచ్చాడు. ప్రపంచంలోనే ఇది చాల ప్రాచీనమయిన ప్రామిసరీ నోట్! డబ్బు అందడంతో పెళ్లి ఏర్పాట్లు చకచకా సాగాయి.

వైశాఖమాసం శుక్లపక్షం దశమి శుక్రవారం ఉత్తరఫల్గునీనక్షత్రంతో కూడిన శుభలగ్నంలో పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం నారాయణవనంలో వైభవంగా

జరిగింది. ఆ వివాహానికి శ్రీనివాసుని కోరికమీద వచ్చిన కొల్హాపుర లక్ష్మి పద్మావతీ శ్రీనివాసుల వివాహానంతరం వెళ్ళిపోయింది. పెళ్ళివేడుకలు తీరాక పద్మావతీ శ్రీనివాసులు తిరుమలకు బయలుదేరారు. కొత్తదంపతులు ఆరు నెలలదాక కొండ ఎక్కరాదనే ఆనాటి నియమం ప్రకారం స్వర్ణముఖీతీరంలో అగస్త్యాశ్రమంలో కాలం గడుపుతుంటే తొండమాన్ చక్రవర్తి స్వామిని కలుసుకొన్నాడు. ఆ సమయంలో శ్రీనివాసుడు

'చక్రవర్తీ! వేంకటాద్రిలో దివ్యకనకమయమయిన మందిరం నిర్మించు. ఆ మందిరం దేవాలయంగానే ఉండాలి. రెండు గోపురాలతో, ఏడు ద్వారాలతో వాస్తుశాస్త్రప్రకారం కట్టించు. ఒక చిన్నవిషయం. అక్కడి రంగదాసు త్రవ్వించిన బావిని యథాతథంగానే ఉండనివ్వు. ఆ బావిని త్రవ్విన వాడెవడో కాదు. అతడు



రంగదాసు. రంగదాసు ఎవరోకాదు. పూర్వజన్మంలో నీవే అన్నాడు.

స్వామి ఆనతిచ్చిన ప్రకారం తొండమానుడు విశ్వకర్మ సాహాయ్యంతో ఆలయం కట్టించాడు. మూడు ప్రాకారాలు, రెండుగోపురాలు, ఏడు ద్వారాలు, ఆస్థానమంటపం, ముఖమంటపం, గోశాల, ధాన్యశాల, వంటశాల, వైవాహిక మంటపం, వంటశాలకు ముందు భూతీర్థమనే బావి కూడా నిర్మించాడు. మధ్యలో ఆనందనిలయ విమానం. విమానం మీద బంగారు కలశాలు. విశాలమయిన మూడు మాడవీధులు, పరుషజనం రావడానికి వీలుగా సోపాన మార్గం, భక్తులు సేదతీరడానికి వీలుగా దారిలో మంటపాలు, నీరాగారాలు (చలివేంద్రాలు) నిర్మించి స్వామితో సర్వం సంపూర్ణమయిందని సెలవిచ్చాడు. స్వామి సంతోషించి పద్మావతితో బయలుదేరి మంగళవాద్యాలు మ్రోగుతుంటే



వికృతి నామసంవత్సరం పాడ్యమి, అశ్వినీనక్షత్రం గురువాసరం కూడిన శుభదినం వైఖానస ఆగమోక్తంబుగా పూజలు జరుగుతుంటే శ్రీనివాసుడు ఆనందనిలయంలో ప్రవేశించాడు. ఆ సందర్భంలో బ్రహ్మ ఇంద్రాదులతో

"హరి సాన్నిధ్యంలో రెండు అఖండ దీపాలు ఎపుడూ వెలుగుతుంటాయి. కలియుగాంతంలో దీపజ్వాలలు కొండెక్కుతాయి. విమానం కూలిపోతుంది. తదనంతరం స్వామి వైకుంఠం చేరుకొంటా"రని చెప్పాడు. ఈ మాట చెప్పగానే స్వామి తనకు రథోత్సవం చేయించమని కోరాడు. స్వామి ఆనతి మేరకు తొండమాన్ చక్రవర్తి వైఖానస ఆగమోక్తంగా బ్రహ్మోత్సవాన్ని అంగరంగవైభవాలతో నిర్వహించాడు.

**పద్మసరోవరం :**

శ్రీనివాసుడు పద్మావతితో సంతోషంగా కాలం గడుపుతున్నాడు. కాని తాను ఆదిలక్ష్మికి అన్యాయం



చేశానేమో అనే బాధ అతనిలో అణగారలేదు. లచ్చిని ఒప్పించి తిరుమలకు రప్పించుకోవాలనే ఆశ నానాటికి పెరుగుతూనే ఉంది. చివరకు తన కోరికను పద్మావతితో చెప్పగా ఆమె కూడా సమ్మతించింది. శ్రీనివాసుడు సంబరపడి సరాసరి కొల్హాపురం వెళ్ళాడు. అక్కడ లక్ష్మి కనబడలేదు. పదేళ్ళు తపస్సు చేసినా ఫలితం శూన్యం. ఇంతలో ఆకాశవాణి

"శ్రీనివాసా! ఈ అవతారంలో శ్రీమహాలక్ష్మి నిన్ను చేరడం కల్ల. మన వియోగం వైకుంఠంలో జరిగింది. మరల సంయోగం వైకుంఠంలోనే. అంచేత నీవు సరాసరి స్వర్ణముఖీతీరంలో శుకమహర్షి ఆశ్రమం దగ్గర పద్మసరోవరం నిర్మించు. పద్మాలు ఎపుడు వికసించివుండేలా సూర్యనారాయణుని ప్రతిష్ఠించు. లక్ష్మిని ఆరాధించు. ఆ తల్లి పద్మసరోవరంలో ఆవిర్భవిస్తుంది' అని పలికింది. శ్రీనివాసుడు అలాగే చేశాడు. కార్తికమాసం

శుక్లపక్షం పంచమి శుక్రవారం ఉత్తరాషాఢనక్షత్రం అభిజిత్‌లగ్నంలో అలమేలుమంగ పదహారేళ్ళ యువతిగా ఆవిర్భవించింది. స్వామి ఆమెను ఏలుకొన్నాడు.

తొండమాన్‌చక్రవర్తి రాజ్యమేలుతుంటే ఒకనాడు ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. 'మహాప్రభూ! నేను కాశికి వెళుతున్నాను. నా భార్యాబిడ్డలకు నీవే సంరక్షకుడివి. నేను తిరిగి వచ్చేదాకవారిని కనిపెట్టుకొని ఉండాలి అని కోరుకొన్నాడు. రాజు సరేనన్నాడు. రాజు వారికి నివాసం ఏర్పాటు చేశాడు గాని వారి ఆలనా పాలనా మరిచాడు. కొంతకాలానికి వారు చనిపోయారు. కాశికి వెళ్ళిన బ్రాహ్మణుడు తిరిగివచ్చి భార్యాబిడ్డల క్షేమవార్త లడిగేసరికి తొండమాన్ గతుక్కుమన్నాడు. వాకబు చేస్తే వారు మరణించారని తెలిసింది. ఈ ఆపద నుండి గట్టెక్కించేవాడు శ్రీనివాసుడే అని భావించాడు. బ్రాహ్మణునితో నీ భార్యాబిడ్డలు తిరుమలకు వెళ్లారని



ఒక్కరోజు ఆగమన్నాడు. ఈ లోగా తొండమానుడు తిరుమలకు వెళ్ళి తాను ఎదుర్కొంటున్న సమస్యను విన్నవించి తాను గట్టెక్కేమార్గం సూచించమన్నాడు. స్వామి ఆ కుటుంబాన్ని బతికించాడు. తొండమాన్ స్వామిని వేనోళ్ళ ప్రస్తుతించాడు. అంత శ్రీనివాసుడు తొండమాన్‌తో

"కలియుగంలో జనులతో ఇలా ప్రత్యక్షంగా మాటలాడితే ఎన్నో ధర్మసంకటాలు వస్తాయి. అందువల్ల నేను ఇంకా మాటలాడను. చెప్పదగినవి ఏమయినా ఉ ంటే స్వప్నాలలోనే చెబుతాను" అని మౌన ముద్ర వహించాడు.

**తిరుమలలో ఉత్సవాలు :**

తిరుమల అనగానే 'నిత్యకల్యాణం పచ్చతోరణం' అనడం సహజం. తిరుమలలో స్వామివారికి నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు,



మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు వైభవంగా జరుగుతుంటాయి.

**నిత్యోత్సవాలు :**

తొలిసేవ సుప్రభాతసేవ, 'కౌసల్యా సుప్రజారామ' అని మొదలయ్యే సుప్రభాత శ్లోకాన్ని వేదపండితులు పఠిస్తుంటే బంగారు వాకిళ్లు తెరచి స్వామిని మేలుకొలపడమే సుప్రభాతసేవ.తరువాత మూలవరులకు, ఉత్సవ మూర్తులకు రంగురంగుల పూలమాలలు సమర్పించడం తోమాలసేవ. ప్రతిదినం బంగారు సింహాసనంపై కొలువుశ్రీనివాసమూర్తికి ఆనాటి పంచాంగ విశేషాలతోబాటు ముందురోజు ఆదాయవ్యయాలు వినిపించడం. శ్రీనివాసునికి తులసీదళాలతో చేసే నామార్చన సహస్రనామార్చన. మధ్యాహ్నం శ్రీదేవీ భూదేవి సమేతులయిన మలయప్పస్వామికి జరిగే సేవ కల్యాణోత్సవం. ఆపై అద్దాల మండపంలో సాగేది



డోలోత్సవం (ఉయ్యాలసేవ) ఆపై వైభవమంటపంలో ఆర్జితబ్రహ్మోత్సవాదులు. ప్రతిదినం సాయంకాలం ఆలయంబయట కొలువు మండపంలో కొనసాగేది సహస్రదీపాలంకరణసేవ. ఆపై మాడవీధులలో స్వామి భక్తజనులను అనుగ్రహిస్తారు. ప్రతిదినంచివర రాత్రిపూట జరిగేది పవళింపు సేవ.

తిరుమలలో శ్రీవారి మూలమూర్తికి ఒక్కొక్కరోజు ఒక్కొక్కరకమయిన సేవలు జరుగుతాయి. మంగళవారం అష్టదళ పాదపద్మారాధన. బుధవారం సహస్ర కలశాభిషేకం. గురువారం ఉదయం తిరుప్పావడ, సాయంకాలం పూలంగిసేవ, శుక్రవారం మూలవరులకు అభిషేకసేవలు.

**విశేషోత్సవాలు :**

తిరుమలలో ఎన్నో విశేషోత్సవాలు జరుగుతుంటాయి. వాటిలో సుప్రసిద్ధమయినది బ్రహ్మోత్సవం.

బ్రహ్మ అంతటివాడు ముందు నిలబడి ఏలోటు లేకుండా జరిపే ఉత్సవం, బ్రహ్మాండంగా జరిగే ఉత్సవం కనుక బ్రహ్మోత్సవం. మొదటి బ్రహ్మోత్సవం కన్యామాసంలో శ్రవణానక్షత్రం నాడు జరిగింది. స్వామి అవతరించిన నాటికి పూర్తి అయ్యేలా తొమ్మిది రోజుల ముందునుంచి శ్రీనివాసుడికి బ్రహ్మదేవుడు ఉత్సవాలు నిర్వహించాడని పురాణాలు ఘోషిస్తున్నాయి.

మూడేళ్ళకు ఒకసారి తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మొదటిది సాలకట్ల బ్రహ్మోత్సవం. రెండవది నవరాత్రి బ్రహ్మోత్సవం. రెండవ బ్రహ్మోత్సవానికి ధ్వజారోహణాదులుండవు. సంవత్సరానికి ఒకసారి జరిగే బ్రహ్మోత్సవం ధ్వజారోహణతో ప్రారంభమై ప్రతిదినం రెండుపూటలా పెద్దశేషవాహనం. చిన్నశేషవాహనం, హంస, సింహ,



ముత్యపు పందిరి వాహనాలు, కల్పవృక్ష, సర్వభూపాల, గరుడ, గజ, సూర్యప్రభ, చంద్రప్రభ, రథోత్సవ, అశ్వవాహనాలతో జరిగే బ్రహ్మోత్సవాలు, పదవరోజు చక్రస్నానంతో పూర్తి అవుతాయి.

తిరుమల బ్రహ్మోత్సవాలలో ఎన్నో ప్రత్యేకతలు. రాత్రిపూట ధ్వజారోహణం జరగడం ఒక విశేషం. రెండు సర్పవాహనాలు జరగడం మరో విశేషం. గరుడోత్సవం రాత్రి వేళ సాగడం ఇంకొక ప్రత్యేకత. గరుడోత్సవం నాడు శ్రీవిల్లిపుత్తూరు నుండి ఆండాళ్‌కు అలంకరించిన పూలమాలను స్వామికి అర్పించడం ఒక అంశమయితే మూలవరులు ధరించే మకరకంఠి. సాలగ్రామహారాలతో స్వామి మలయప్ప మాడవీధులలో ఊరేగడం కనులార దర్శించదగ్గ ఉత్సవం. బ్రహ్మోత్సవాలలో బంగారు రథోత్సవం మరో ప్రత్యేకత.



**పుష్పయాగం :**

కార్తికమాసంలో స్వామివారి జన్మనక్షత్రమయిన శ్రవణానక్షత్రం రోజున మలయప్పస్వామికి రకరకాల పుష్పాదులతో వైభవంగా జరిగే ఉత్సవం పుష్పయాగం. తిరుమలకు పుష్పమండపమనిపేరు. ప్రభుత్వాధినేతలు. దేశాధిపతులు తమ ప్రభుత్వాలు సక్రమంగా సాగాలని, దేశం సుభిక్షంగా ఉండాలని పుష్పయాగం చేసేవారట. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలోని వైష్ణవాలయాలలో కూడా పుష్పయాగాలు జరుగు తున్నాయి.

**పారువేట ఉత్సవం :**

సంక్రాంతి పండుగ మరునాడు కనుమ పండుగరోజు మలయప్పస్వామి పంచాయుధాలతో వనవిహారానికి వెళతారు. అపుడు అర్చకస్వామి వెండి



బల్లేన్ని (ఈటెన) చేతిలో పట్టుకొని పరుగెడుతూ మృగాల్ని వేటాడినట్టు అభినయిస్తారు. ఇదే పారువేట. తిరుమలలో పారువేట మండపం ఉంది.

**తెప్పోత్సవం :**

తిరుమలలో భక్తజనులు అందరు దర్శించడానికి వీలయిన ఉత్సవం తెప్పోత్సవం. ఈ ఉత్సవం స్వామి పుష్కరణిలో ఫాల్గుణమాసం శుద్ధ ఏకాదశినుండి ఐదురోజులు జరుగుతాయి. అన్నమయ్య ఈ ఉత్సవాన్ని **'దేవునికి దేవికిని తెప్పల కోనేరమ్మ'** అని వర్ణించాడు.

**పవిత్రోత్సవాలు :**

తిరుమలలో జరిగే ఉత్సవాలలో పవిత్రోత్సవాలకు ఎంతో ప్రాధాన్యముంది. ఆగమోక్తంగా ఆలయంలో కైంకర్యాలు జరిగినా తెలిసీ తెలియక దోషాలు జరగవచ్చు. అలాంటి దోషనివారణార్థం, ఆలయపవిత్రత

కోసం జరిగే ఉత్సవం పవిత్రోత్సవం. తిరుమలలో శ్రావణశుద్ధ దశమి ఏకాదశి, ద్వాదశి తిథులలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఆలయంలోని మూర్తులకు పవిత్రమాలలు సమర్పించడం ఈ ఉత్సవం ప్రత్యేకత.

**వసంతోత్సవం :**

తిరుమలలో జరిగే నయనానందకర ఉత్సవాలలో వసంతోత్సవాలు ఒకటి. చైత్రశుద్ధ త్రయోదశి నాటినుండి పూర్ణిమ దాకా మూడురోజులు ఈ వసంతోత్సవాలు జరుగుతాయి. తిరుమలలో మూలవరులకు శ్రీదేవి భూదేవి మూర్తులకు పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు పసుపుతో అభిషేకం నిర్వహిస్తారు. ఆపై శుద్ధోదకంతో అభిషేకం. ఇలా చేయడంవల్ల ఆ విగ్రహాలలో సౌకుమార్యం. శోభాగుణం పెరుగుతాయి. అంతేగాక తాపగుణనివారణ కూడా.



**కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం :**

వైష్ణవాలయాలలో జరిగే మరొక ప్రత్యేక తిరుమంజనం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం. గుడిని ఆళ్వారుగా భావించి శుద్ధి చేపట్టడం. తిరుమలలో నాలుగుమార్లు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఉగాది, ఆణివార ఆస్థానం బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశులకు ముందుగా వచ్చే మంగళవారం జరిగే తిరుమంజనం. నిత్యం జనసమ్మర్దంతో ఉండే ఆలయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వడం ఈ ఉత్సవ ప్రయోజనం.

**చక్రస్నానం :**

బ్రహ్మోత్సవాల సమయంలో చివరి రోజూ వరాహస్వామి ఆలయ ప్రాంగణంలో సుదర్శన స్వామికి శ్రీదేవి భూదేవులతోపాటు జరిగే స్నపనతిరుమంజనం మనోహరమయిన కార్యక్రమం. ఒకే పీఠం మీద స్వామి



వారి పక్కన సుదర్శన చక్రం నిలిపి చేసే కార్యక్రమం. భక్తుల్ని రక్షించడంలో 'నీవు నాకు వెంట ఉండి సహాయం చేస్తున్నావు. ఈతొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని అలసి సొలసి ఉంటావు'. అని స్వామి తనతోబాటు సుదర్శనుడికి పవిత్ర జలాలతో అర్చక స్వాములచేత స్నపన తిరుమంజనం చేయించడం విశేషం

అయితే ఇన్ని రోజులు ఈ ఉత్సవాలు ముందుండి జరిపిన బ్రహ్మదేవునికి గాని, క్షేత్ర పాలకుడయిన రుద్రునికి గాని, స్వామికి వాహనాలయిన గరుత్మంత, హనుమంతులకు గాని ఈ భాగ్యం దక్కలేదు. ఒక్క సుదర్శనుడికే దక్కింది ఆ భాగ్యం. స్వామి– సుదర్శనుడు ఒకటే అని అంతరార్థం. ఇవేగాక తిరుమలలో 'రథసప్తమి' అర్థబ్రహ్మోత్సవంగా జరుగుతుంది. ఇవేగాక 'ఉట్లోత్సవాలు' నయనానందకరంగా జరుగుతాయి.

తిరుమల 'నారాయణగిరి' ఉద్యానవనంలో అన్నమయ్య వర్ధంతి మహోత్సవాలు. పురందరదాసు



ఆరాధనలనాడు శ్రీదేవి భూదేవి సహిత మలయప్పలు ఉయ్యాలలో ఊగుతూ కీర్తనలను ఆలకిస్తారు.

ఇటీవల భక్తుల కోరిక మేరకు ప్రతి పున్నమినాడు 'గదరుడసేవ' తిరుమల మాడవీధులలో నిర్వహిస్తున్నారు. అశేషప్రజానీకం ఈ ఉత్సవాన్ని తిలకించి పులకితులవుతున్నారు.

**'వేంకట' నామ వైశిష్ట్యం :**

తిరుమలేశునికి అనంతనామాలు. శ్రీవైష్ణవులు 'పెరుమాళ్' అని శ్రీనివాసప్పెరుమాళ్ అని నోరార పలుకుతారు. 'హరే శ్రీనివాస' అని కన్నడిగులు సేవిస్తారు. 'దేవరందరె తిమ్మప్ప' అని కన్నడహరిదాసులు కీర్తిస్తారు. అయినా స్వామికి 'వేంకటేశ్వర' నామం సుప్రసిద్ధం.

వేంకట పదానికి రెండురకాలయిన వ్యుత్పత్తులు పురాణాలలో చెప్పబడ్డాయి. 'వేం' అంటే పాపం. కట

అంటే దహించేది. సర్వపాపాలను దహించేది కనుక 'వేంకటం' అని వరాహపురాణం. అయితే వామనపురాణం మరో అర్థవిశేషం చెప్పింది. వకారానికి అమృతమని 'కట' శబ్దానికి ఐశ్వర్యమని అమృతైశ్వర్య సంపూత రూపమున ఉండేది శ్రీవేంకటాద్రి అని అర్థవిశేషం. ఆళ్వారులలో ఒకరయిన నమ్మాళ్వార్ వేం కడంగళ్–కట శబ్దానికి కడంగల్–సకల ఋణములు, పాపములు నశించును అనే అర్థవిశేషం చెప్పారు. సకలప్రతిబంధకాలను పోగొట్టి సర్వేశ్వరుని దివ్యకృపాకటాక్షామృతాన్ని ప్రసాదించేది వేంకటాచలం. ఆళ్వారుల పాశురాలలో చాల వరకు 'తిరువేంగడ' ప్రసక్తి ఎక్కువ. పాపములను తొలగించగల సర్వసమర్థుడు వేంకటేశ్వరుడని సారాంశము.

తిరుమలలో 'గోవింద' నామానికి ప్రాచుర్యం. చోళరాజుగోపాలకుడు శ్రీనివాసుడు దాగివున్న పుట్టపై పాలు స్రవింపజేస్తుంటే కోపంతో గోవుపై గొడ్డలి విసిరాడు.



గోహింస, గోవధ పరమపాతకమయిన క్రియలు. సకలదేవతాస్వరూపిణి గోవు. ఆగోవుకు దెబ్బ తగుల కూడదని శ్రీనివాసుడు అడ్డం పడ్డాడు. గోహింస, గో పీడనం జరగకుండా జాగ్రత్త పడ్డాడు. గోవుకు ఆనందం కలిగించినవాడు కనుక గోవిందుడయ్యాడు. ఆ కారణం వల్లనే భక్తులు కొండ మెట్లు ఎక్కేవేళల్లో, స్వామి దర్శనం కోసం వేచిఉండే వేళల్లో, గోవిందా గోవిందా అని స్మరిస్తూ తమ భక్తిని ప్రకటించుకొంటారు. అటువంటి స్వామిని భజించి, సేవించి తరించిన భక్తులెందరో, భగవద్భక్తికంటే భాగవతభక్తి సర్వశ్రేష్ఠం. వారి స్మరణ పుణ్యప్రదం.

**శ్రీవారి భక్తులు :**

శ్రీవారిని సేవించిన పౌరాణిక భక్తులు తొండమానుడు – కురువరతినంబి. తొండమానుడు చక్రవర్తి. రాజోచితంగా స్వామికి వేయి బంగారుపుష్పాలతో



పూజించేవాడు. రోజులు గడిచేకొద్ది తనలాగ స్వామిని అర్చించేవారు లేరనే అహంభావం అతనిలో పెరిగింది. ఒకరోజు తాను అర్చనకు గుడిలోకి వెళ్ళిన వేళ తానర్పించిన బంగారుపూలు దూరంగా నెట్టివేయబడి ఉండడాన్ని చూచాడు. స్వామిపాదాల మీద ఐదారు మట్టిపూలు కనిపించడంతో ఖంగు తిన్నాడు. అయినా ఈ వైనానికి కారణమేమిటో తెలుసుకొందామని స్వామినే ప్రశ్నించాడు. స్వామినే ప్రశ్నించాడు. స్వామి చక్రవర్తి ఆవేదనను అర్థం చేసుకొని ఇలా అన్నాడు.

రాజా! నీవే పరమభక్తుడవని అనుకొంటున్నావు. అహంకారంతో అర్చిస్తున్నావు. కాని నీకంటె పరమభక్తులెందరో ఉన్నారు. వారిలో భీముడనే కుమ్మరి భక్తుడొకడు. అతడు కుండలు చేస్తూ ఎండలో ఎండబెడుతూ నా దర్శనానికి కూడా రాలేక పనిపూర్తి అయ్యేవేళ చేతిలోని మట్టితో పూలగా తీర్చి నా దారు



విగ్రహానికి రోజూ సమర్పిస్తున్నాడు. అతడు సమర్పించే పూలు ఇవి' అన్నాడు.

వెంటనే తొండమానుడు కుమ్మరి భక్తుణ్ణి భీముడు చూడాలని కదలి వెళ్లాడు. అప్పటికే మట్టి మూకుట్లో పెట్టిన సంకటిని స్వామి ప్రియంగా ఆరగిస్తున్న దృశ్యం చూడాడు. రాజు వారి దగ్గరికి వెళుతుండగనే శ్రీవైకుంఠం నుండి బంగారు విమానం వచ్చింది. కుమ్మరిదంపతులు ఆ విమానం ఎక్కగానే విమానం వైకుంఠానికి ఎగిరిపోయింది. వేంకటేశ్వరుడు అదృశ్యమయ్యాడు. ఈ పేదభక్తుని భక్తిని అన్నమయ్య

**ఎటువంటి వాడివో నీ మహిమ లెట్టు దెలియవచ్చును**
**నిటలలోచనుడు అజుడు తెలియలేరు'** అనే కీర్తనలో

**'కురువనంబిచేతి బంకమట్టి పువ్వులు**
**కొన్ననాడే తెలిసే మీ భోగమని'** వర్ణించాడు.

**తిరుమలనంబి :**

తిరుమలేశునికి జీవితాంతం తోయకైంకర్యం చేసినవాడు తిరుమలనంబి. వీరికి శ్రీశైలపూర్ణులనిపేరు. స్వామి అభిషేకార్థం నంబి పాపవినాశతీర్థానికి వెళ్ళేవాడట. ద్రావిడప్రబంధపారాయణం చేస్తూ కుండలో ఆ తీర్థ జలాన్ని తెచ్చేవాడట. తిరుమలనంబి వార్ధక్యంలో పడుతున్న ఇబ్బందిని స్వామి చూచాడు. ఒకసారి ఘటజలంతో తిరుమలనంబి వస్తుంటే తాతా! నాకు దాహం వేస్తుంది. మంచి నీళ్ళివ్వవూ అని అడిగితే ఈ జలం స్వామి అభిషేకార్థ జలం. ఇవ్వడానికి వీల్లేదు' అన్నాడు. బోయకుర్రవాడయిన స్వామి తిరుమలనంబి వెంటబడుతూ తలమీది నీటికుండ తగిలేలా చిరురాయి విసిరాడు. కుండకు పడిన చిన్నరంధ్రం ద్వారా ధారగా కారుతున్న నీటిని దోసలి పట్టి తాగుతూ వెంట నడిచాడు. కాసేపటికి కుండ ఖాళీ కావడం, భుజం తడిసి చల్లగా



ఉండడంతో తిరుమలనంబి వెనక్కి తిరిగి చూచాడు. బోయకుర్రవాణ్ణి చీవాట్లు పెట్టాడు. మరల సుదూరంలోని పాపవినాశనానికి వెళ్ళలేనుకదా! అని అంగలార్చాడు. అపుడు బోయకుర్రవాడు స్వామీ! దగ్గర్లో అంతకంటే మంచి తీర్థం చూపిస్తానని బాణంతో కొండవాలును కొట్టాడు. కొండకు రంధ్రం పడింది. ఆ రంధ్రం నుండి పారే జలాన్ని నింపుకొని తిరుమలనంబి గుడికి వెళ్లాడు. ఆలయంలో స్వామి అర్చకముఖతః 'తాతా! దారిలో నీ ఇచ్చిన తీర్థంతో నా దాహం తీరింది. ఈ రోజు నుంచి దగ్గర్లోని కొత్తతీర్థం నుండి జలం తీసుకురా' అని పలికించాడు. తిరుమలనంబి అయ్యో! వెంటబడినవాడు సామాన్యుడని భావించి స్వామిని తిట్టానే – అంటూ సాష్టాంగనమస్కారం చేశాడు. ఆనాటి నుండి తిరుమలనంబి తిరుమలతాతాచార్యులుగా ప్రసిద్ధి పొందారు. సంస్కృతంలో 'తాత' అంటే తండ్రి. ఈనాటికి తిరుమలనంబి సేవాకైంకర్యాన్ని గుర్తుంచుకొనేలా



దేవస్థానం వారు 'తణ్ణీరముదు' ఉత్సవం జరుపుతున్నారు. అన్నమయ్య

**'తిరుమలనంబి తా తాత యన్ననాడే**
**తెలిసెబో మీ పెద్దతనములు'** అని వర్ణించాడు.

**అనంతాళ్వాన్ :**

రామానుజుల శిష్యపరంపరలో అనంతాళ్వాన్ ఒకడు. ఒకసారి శ్రీరంగంలో రామానుజల వారు గోష్ఠిలో ఒక 'తిరుమలలో పుష్పకైంకర్యం సరిగా జరగడంలేదు. ఎవరయినా అక్కడికి వెళ్ళి సుమకైంకర్యం చేయగలరా' అని ప్రశ్నించాడు. తిరుమలలోని వాతావరణానికి జడిసి కొందరు మౌనంగా ఉండిపోయారు. అపుడు అనంతాచార్యులు 'తమరు అనుమతిస్తే నేను తిరుమలకు వెళతానన్నా'రు. రామానుజులు సంతోషించి నీవే 'మగవాడివి' అన్నారట. అనంతాళ్వాన్ భార్యతో తిరుమల



చేరుకొన్నారు. స్వామి పుష్పకైంకర్యం కోసం ఒక చెరువును త్రవ్వడం మొదలెట్టారు. ఇతరుల సాయం కోరరాదని అనంతాళ్వాన్ భావించారు. తాను మట్టిని తవ్వడం తన భార్య మట్టిని దూరంగా పోయడం ఇదీ వాళ్ళిద్దరి పని. ఇలా కొంతకాలం సాగింది. వీరికి స్వామి సాయం చేయాలను కొన్నాడు. ఒక కుర్రవాడుగా మారాడు. అనంతాళ్వాన్ దగ్గరికి వెళ్ళి అమాయకంగా తానో సాయం చేస్తానన్నాడు. ససేమిరా వీల్లేదన్నాడు అనంతాళ్వాన్. కాసేపాగి కుర్రవాడు అనంతాళ్వాన్ భార్యతో 'అమ్మా' నీవు బాగా అలసిపోయావు. నేను కాసేపు నీ పని చేసిపెడతాలే! నీవు విశ్రాంతి తీసుకోవమ్మా' అన్నాడు. ఆమె సరేనంది. చెరువు తవ్వేపనిలో కుర్రాడు తానూ భాగస్వామి అయ్యాడు. పని జోరందుకొంది. కాసేపటికి అనంతాళ్వాన్ కుర్రవాణ్ణి చూచి కేకలేశాడు. కుర్రవాడు పరుగిడుతుంటే చేతిలోని గునపాన్ని అతనిపై విసిరాడు. ఆగడ్డపార కుర్రవాడి

గడ్డానికి తగిలింది. గాయమయింది. రక్తం బొటబొటా కారింది. అయినా కుర్రవాడు గుడికేసి పరుగులు తీశాడు. సాయంకాలం అనంతాళ్వాన్ గుడిలోకి వెళ్ళాడు. స్వామి గడ్డంలోని గాయాన్ని చూచి గాభరా పడ్డాడు. పచ్చకర్పూరం పొడి అద్దాడు. తనకు సాయం చేయడానికి వచ్చినవాడు స్వామి అని తెలిసి కన్నీరు కార్చాడు. అనంతాళ్వాన్ స్వామిపై విసరిన 'గునపం' నేటికీ మహాద్వారం ప్రవేశంలో కుడివైపు గోడమీద నేటికీ చూడవచ్చు. స్వామికి అనంతాళ్వాన్‌కున్న అనుబంధం గురించి ఇంకా ఎన్నోకథలున్నాయి. నేటికీ అనంతాళ్వాన్ సేవలు గుర్తుకు తెచ్చుకొనేలా 'బాగ్‌సవారి' ఉత్సవాన్ని దేవస్థానంవారు నిర్వహిస్తున్నారు. అన్నమయ్య

**'అనంతాళువారి చెఱువు గట్ట**
**మన్నుమోయగా దెలిసె మీనటనలు'** అని వర్ణించాడు.



**రామానుజులు :**

దక్షిణభారతదేశంలో అవతరించిన మతాచార్యులలో 'రామానుజులు' ఒకరు. వారే విశిష్టాద్వైత మతస్థాపకులు. తిరుమలకు రామానుజులు చేసిన కైంకర్యాలు అనంతం.

రామానుజుల కాలం నాటికి కొండమీది దేవుడు శివుడా? విష్ణువా? కుమారస్వామినా? శక్తి దేవతా అని అనేక సందేహాలుండేవి. రామానుజులు వివిధగ్రంథాల నుండి ప్రమాణాలు చూపించి కొండమీది దేవుడు విష్ణువని నిరూపించారు. కొండమీది ఆలయం తిరుమాడ వీధులను వెడల్పుచేసి ఉత్సవాలకు తగినట్లు తీర్చారు. బ్రహ్మోత్సవాలు తిరుమలలోనే జరిగేలా కట్టుదిట్టం చేశారు. వైఖానసులను గౌరవిస్తూ ఆలయంలో ద్రావిడ ప్రబంధపారాయణానికి సముచితస్థానం కల్పించారు.



ఆలయవ్యవస్థ సక్రమంగా ఉండేలా నియమాలు చేశారు. ధర్మాధికారిగా జీయర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. శుక్రవార అభిషేకానికి ప్రాధాన్యం కూర్చారు. మూడు మార్లు తిరుమలకు విచ్చేసి స్వామిని సేవించారు. వారి సేవ అమోఘమయింది. అందుకే అన్నమయ్య **ఖిలమైన కలియుగమందును గతి యీతడే చూపె ఘనగురుదైవము.** (అధ్యా. 185 రేకు) అని కీర్తించాడు.

**అన్నమయ్య :**

తిరుమలేశునికి అనేకానేక కైంకర్యాలు చేసిన వారిలో తాళ్లపాక వంశస్థులు ప్రసిద్ధులు. ఆ వంశంలో మొదటివాడు అన్నమయ్య. రోజుకొక కీర్తనవంతున 32 వేల కీర్తనలు పాడిన వాగ్గేయకారుడు. తానుగాక తన వారిని కూడా స్వామి సేవలో నిమగ్నమయ్యేలా చేసిన ఘనత అన్నమయ్యదే. ఉట్ల ఉత్సవం, కల్యాణోత్సవం



జరగడానికి వీరే ప్రేరకులు. పన్నిద్దరుఆళ్వారుల రచనలకు సాటిగా శృంగార, ఆధ్యాత్మిక కీర్తనలు పాడిన వైష్ణవోత్తముడు. జానపదరీతులను అభిమానించి మేలుకొలుపులు. ఊయలపాటలు, జోలపాటలు, చిలుక పాటలు, మనసాంకితపదాలు, తందనానపాటలు పాడిన సాహిత్యాభిమాని. నేటికీ అన్నమయ్య లాలిపాట గుడిలో తప్పనిసరి. అన్నమయ్య పాటల గొప్పతనాన్ని గుర్తించి దేవస్థానం వారు అనేకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. ఒకప్పుడు త్యాగయ్య కృతులకు బహుళ ప్రచారమయితే నేడు అన్నమయ్య పాటలు వినబడని ప్రదేశము లేదనడం స్వభావోక్తి అతడు వాగ్గేయకారులకు అన్న, అమ్మ అనుగ్రహం పొందిన భక్తుడు. 'పిలిస్తే పలికే అయ్య' పదకవితా పితామహుడుగా ధ్రువస్థానం పొందిన ఆలయకవి, అనుభవ కవి. అందుకే అన్నమయ్య వంశీకులు

**హరియవతార మీతడు అన్నమయ్య**
**అరయమీగురు డిత డన్నమయ్య**
**భావింప శ్రీవేంకటేశు పాదములందె వున్నవాడు**
**హావభావమై తాళ్లపాక అన్నమయ్య'**

అని కీర్తించారు. అన్నమయ్య 'కలం పట్టిన కత్తి' అ భక్తుడు 'నందకాంశ' సంభూతుడు.

**హాథీరాం బావాజీ :**

శ్రీవారి భక్తులలో చిరస్మరణీయుడయిన భక్తుడు మహంతు హాథీరాంజీ బావాజి. ఇతడు ఉత్తర భారతదేశం నుండి వచ్చినవాడు. ఇతని అసలు పేరు రాం. తిరుమలేశు ని దర్శించడానికి వచ్చిన 'రాం' ఇక్కడ ఉండిపోయాడు. తిరుమల అతనికి నిత్యనివాసమయింది. దీనికి తోడు స్వామి వారివట్ల భక్తిభావం పెరిగింది. జపతపాదులతోబాటు తిరుమలకు వచ్చే యాత్రికులకు



తాను చేయగలిగినంత సహాయం చేయాలనుకొన్నాడు. అన్నదాన, వస్త్రదానాదులు చేసేవాడు. అతనిలో భగవద్భక్తి భాగవతభక్తి రెండూ పెనవేసుకొన్నాయి. ప్రతిదినం రాత్రిపూట ఆలయంలో ఏకాంతసేవ అనంతరం వేంకటేశ్వరస్వామి బావాజి కుటీరానికి వెళ్ళి మాట్లాడేవాడట. రాత్రంతా ఆయనతో పాచికలాడేవాడట. ఆటలో స్వామి ఓడిపోతూ ఆనందించేవాడట. ఈ కథలన్నీ కర్ణాకర్ణిగ విని చంద్రగిరి రాజు బావాజి అసలు కథ తెలుసుకోవాలనుకొన్నాడు. తిరుమలకు వచ్చాడు. బావాజీని కారాగారంలో పెట్టించాడు. బండెడు చెరకుల్ని కారాగారంలో వేయించాడు. ఉదయంలోగా అన్నీ తివాలని బావాజిని ఆదేశించాడు. రాత్రి అయింది. మహంతు మగతనిద్రలో ఉన్నాడు. అద్దమరేయి ఒక ఏనుగువచ్చింది. బండెడు చెరకుగడల్ని అవలీలగా ఆరగించింది. ఘీంకారం చేస్తూ వెళ్లిపోయింది. కాపలాదారులు ఘీంకారం విన్నారు.



తెల్లారగానే కారాగారం తలుపు తీశారు. అక్కడ చెఱకుగడలు లేవు. రాజుగారు మహంతు భక్తుడని, స్వామి కరుణాకటాక్షం కలవాడని తెలుసుకొని తన్ను క్షమించ మన్నాడు. ఈనాటికీ తిరుమల క్షేత్రంలో ఆలయానికి అతిసమీపంలో మహంతుల మంటపం ఉంది. ఆ మఠంలో స్వామివారు పాచికలాట ఆడిన గద్దె (అరుగు) శ్రీవారి ఆలయం వెండివాకిలి తలుపుమీద శ్రీవారితో మహంతు పాచికలాడే దృశ్యాలున్నాయి. మహంతుల భక్తి భావాన్ని సేవాతత్పరతను గుర్తించి ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వంవారు ఆలయ తిరుమల బాధ్యతలను అప్పగించారు. మహంతుల పాలనలో కొందరు పాఠశాలలు, సత్రాలు, ప్రామాణిక గ్రంథాల ప్రచురణ, ఆలయ సముద్ధరణ లాంటివి చేశారు. నేటికీ సుప్రభాతసేవలో శ్రీవారికి నవనీతహారతి, తిరుమల మూలవరుల బ్రహ్మోత్సవ, రథోత్సవాలలో ఉత్సవ



వరులకు హారతి, ఆణివార ఆస్థానంలో శ్రీవారికి హారతులివ్వడం కొనసాగుతూ వుంది. అలాగే మహంతు బావాజి సమాధి ఆకాశగంగా తీర్థానికి దగ్గర్లో ఉంది. ఆశ్వయుజ బహుళ త్రయోదశినాడు మహంతు బావాజి వర్ధి ఉత్సవం వైభవంగా జరుగుతుంది. ఆరోజు దేవస్థానం వారు మహంతులకు మర్యాదలను వైభవంగా జరుపుతారు. ఏది ఏమయినా తమది కాని రాష్ట్రంలో సేవలపేరుతో ప్రసిద్ధి గణించిన మహంతులు నిత్యస్మరణీయులే.

**తరిగొండ వెంగమాంబ :**

తిరుమల స్వామి సేవలో తరించిన భక్తశిరోమణి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. చిత్తూరుజిల్లా వాయల్పాడు పట్టణం దగ్గర్లో తరిగొండ గ్రామంలోని కృష్ణయ్య, మంగమ్మ దంపతులకు స్వామి అనుగ్రహంతో జన్మించిన భక్తురాలు వెంకమ్మ. వాడుకలో 'వెంగమాంబ' అనే పేరు స్థిరపడింది.

అన్నమయ్య లాగే వెంగమాంబ బాల్యం నుండి భక్తురాలు. ఎపుడూ తన గ్రామంలోని నారసింహాలయ ఆవరణలోనే గడిపేది. కుమార్తె బాల్యంనాటి భక్తికి తల్లిదండ్రులు సంతోషపడినా ఆవిడ భవిష్యత్తు వారిని కలవరపరచింది. ఒకవేళ పెళ్ళయితే ఆమెలో మార్పు వస్తుందేమో అని నారకుంటపాళెం వెంకచాచలపతికిచ్చి వివాహం చేశారు. కానీ వెంగమాంబ కాపురానికి వెళ్ళకముందే భర్త మరణించాడు. వెంగమాంబ పుట్టింటిలోనే గడపవలసివచ్చింది. ఆమె విధవ అయినా ముత్తైదువలాగే ప్రవర్తించేది. ఈ వైనం ఛాందసవాదులకు నచ్చలేదు. ఆమెను నానాహింసలు పెట్టారు. చివరకు పుష్పగిరిపీఠాధిపతులు వెంగమాంబ 'ఒక యోగిని' అని చెప్పడంతో తోకలు ముడిచారు. ఆపై వెంగమాంబ తిరుమల చేరుకొంది. తాళ్లపాక వారు ఆమెకు



ఆశ్రయమిచ్చారు. అయినా పక్కింటి అర్చకులకు వెంగమాంబ అంటే పడదు. రోజు ఆవిడ గుడికి రావడం హారతి ఇవ్వడం వారికి నచ్చేది కాదు. అంచేత ఆవిడ ఇంటిపెరట్లో ఎంగిలి ఆకులు వేసేవారు. ఆమె ధ్యానానికి భంగం కలిగేది. చివరకు ఆమె విసిగి పోయి 'అర్చకుల వంశం నశించుగాక' అని శపించింది. ఆమె శాపంతో అర్చకుల ఇంట్లోని సంతానం నశించారు. చివరకు అర్చకులు ప్రార్థిస్తే వారి వంశాంకురం నిలిచేలా అనుగ్రహించింది. ఆ తల్లి తుంబురు తీర్థంలో చాలా కాలం గడిపింది. వెంగమాంబ గొప్ప రచయిత్రి. 18 గ్రంథాలను రచించింది. వాటిలో వెంకటాచలమాహాత్మ్యం సుప్రసిద్ధం.

ప్రతిరాత్రి ఏకాంతసేవలో వెంగమాంబ స్వామివారికి కర్పూర హారతి సమర్పించేది. అదే ముత్యాల హారతి.



ప్రతి ఏకాంతసేవ తర్వాత స్వామి వెంగమాంబ ఇంటికి వచ్చేవాడని ప్రసిద్ధి. ఒక రాత్రి స్వామి శ్రీకృష్ణలీలలు వింటూ ఉండగా తెల్లవారింది. సుప్రభాత వేళకు స్వామి హడావిడిగా వెళ్లాడు. స్వామి పీతాంబరం వెంగమాంబ చేతిలో సగం మిగిలిపోయింది. బంగారు వాకిళ్లు తెరచిన అర్చకులు స్వామి వారి వస్త్రం చిరిగివుండడాన్ని గుర్తించారు. వెంగమాంబను అడిగితే ఆ వస్త్రం తెచ్చి ఇచ్చింది. అర్చకులు అందరూ ఆశ్చర్యపోయారు. తరిగొండ వెంగమాంబ మహా భక్తురాలని గ్రహించారు.

ఒకరోజు వెంగమాంబ ముత్యాలహారతితో వెళితే అర్చకులు ఆమెను అవమానించారు. వెంగమాంబ కిమ్మనక ఇంటికి మరలింది. మరుసటిరోజు స్వామి రథోత్సవం. సరిగ్గా రథం ఆమె ఇంటిముంగిట ఆగిపోయింది. అర్చకులు ఏదో అపచారం జరిగిందని భయపడ్డారు. ఎంత ప్రయత్నించినా రథం కదలలేదు.



చివరకు అర్చకులకు ముందు రోజు తాము వెంగమాంబ పట్ల ప్రవర్తించిన తీరు గుర్తుకు వచ్చింది. రథం దిగి వెంగమాంబ ఇంట్లో అడుగుపెట్టి క్షమించమని కోరారు. వెంగమాంబ ఇంటి ముంగిటకు వచ్చి హారతి ఇచ్చింది. రథం కదిలింది. అర్చకులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే ఒకసారి ఒక బ్రాహ్మడిరోగం నయం చేసింది. వెంగమాంబ 1817వ సంవత్సరం శ్రావణమాసం శుద్ధనవమినాడు సమాధి అయింది. ఆమె బృందావనం తిరుమలలో వరాహస్వామి ఆలయానికి ఉత్తరపు దిక్కున రెండువందల గజాల దూరంలో ఉంది.

తిరుమలతిరుపతి దేవస్థానం వారు ప్రతిసంవత్సరం వెంగమాంబ జయంతి వర్ధంతి ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. అంతేకాదు ఆమె పేర మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనాన్ని కూడా తిరుమలలో నిర్మించారు.

**సామాన్యులయిన సార్వభౌములు :**

తిరుమలేశునికి ఎందరో రాజవంశజులు రకరకాల కైంకర్యాలు చేసినవారే. వారిలో విజయనగరపాలకులు ప్రసిద్ధులు. శ్రీకృష్ణదేవరాయలు తిరుమలకు ఏడుమార్లు వచ్చి స్వామిని సేవించిన వాడే. అంతేకాదు నేను సామాన్యభక్తుడనే భావంతో దేవేరులిద్దరితో అంజలి బద్ధుడై నేటికి తిరుమల ఆలయంలో కనిపిస్తున్నాడు. ఈ దృశ్యం చూసినవారికి అనిర్వచనీయమయిన అనుభూతి కలగడం సత్యం. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా పాలకమండలి అధ్యక్షులు, సభ్యులు దేవస్థానం అధికారులు తిరుమల స్వామిసేవలో తమవంతు కృషి చేస్తున్నారనడం వాస్తవం. గ్రామ గ్రామాలకు వేంకటేశ్వర రథయాత్రలను కొనసాగిస్తున్నారు.

**ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను**
**ఏమఱక కొలచిన నితడే దైవము**



**ఘనముగా నిందతికి గన్నులిచ్చు గొల్లిచ్చు**
**పనిసేయ జేతులిచ్చు బలియుడై**
**తను గొలువుమని చిత్తము లిచ్చు గరుణించి**
**వొనర లోకానికెల్ల నొక్కడే దైవము**

**పంతమాడి కొలిచిన ప్రాణమిచ్చు ప్రాయమిచ్చు**
**యెంతటి పదవులైన నిట్టె యిచ్చు**
**వింతవింత విభవాల వెంకటేశుడిదే మా**
**అంతరంగమున నుండే అరచేతి దైవము**

(అన్న-అధ్యా. 128 రేకు)

**వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి**